

# పట్నుమెచ్చినపల్లె

భూపాల్ · రేఖా నవలిక

నా

ఉల్లివువ్వు మనసున్నా చంద్రుడా!

నువ్వు ఉలికి ఉలికి పడకోయీ చంద్రుడా!

కుసుమ వువ్వు మనసు దాని చంద్రుడా!

కుమిలికుమిలి ఏడ్వకోయి చంద్రుడా!

జనం కన్నీళ్ళు సూసి ఎంత మెత్తనై పోతవో ఆ కన్నీళ్ళను దూరం చేస్తందుకు రాయి లెక్క ఉంటవు నువ్వే. నీ ఉత్తరం సదివి ఆ రోజు రాత్రంతా బాధపడ్డ. సుజాతమ్మ సంగతేమైందో?! నువ్వు గాని, నేను గాని సూసిన, సూసి రాస్తున్న ఈ బతుకులెంట, కథలెంటపడి తర్వాత ఏమైందా అని ఆరాలు తీస్తే ఒక్కో కథ ఒక్కో రామాయణమంత ఐతయి. మనమూ తిండి కోసం తిప్పల పడాలిగా అట్ల తిప్పలపడుకుంటనే మనకు శాతనైన మంచి పని ఏమన్నా చేద్దామనిపిస్తుంది. 'కుంటి గాడిదికి జారిందేసాకు' అన్నట్లు మన కెందుకనుకుంటె కాదుమల్ల.

శిత్తకార్తి ఎండలు వుండనే వున్నయి. ఇంక నాల్గు రోజులైతె దసర పండుగ. రాత్రివూట శాన పొద్దు పొయ్యే దాక బత్కమ్మ లాడుతున్నం. నర్రె మైసమ్మ 'పేదోళ్ళ పోచమ్మ' బతుకమ్మ పాట రెండు గంటలు చెప్పింది. పాటల పోచమ్మ బాధలు వద్తుంటే అదో గోసకాదు. ఆ కథనీగ్గూడ తెలుసనుకుంట.

శితలిపండ్లు,కాయలు మస్తుగైనై. నువ్వు దింటు న్నవో లేదో! అప్పడప్పుడు బొబ్బరి కాయగూడ కాల్చుక తింటున్నం. పసులకు పచ్చి దొరుకు తుంది. కాలవు సేలు కొస్తున్నం. అయిదవు పేల్లల బొద్దుగొల ఇరువు కొచ్చింది.

నీ ఉత్తరంల దేశం నిండ ఇయ్యాల మూడు కోట్ల మంది బాల కార్మికులున్నరని రాశినవ్. మన ఊళ్లె వున్న ఏ పోరగాడు పొట్ట కోసం పని జెస్తలేడూ?

ఇట్ల జూస్తే నువ్వు రాసింది, పేపర్ల జూసింది. తక్వనే అని వస్తుంది. అల్లను అయ్యో అనే టోళ్ళు లేరు. బత్కలేక తిండి కోసం అళ్ళు పనిజెయ్యాలి. నా తమ్ముడు ఎంతటోడు మరి. అన్ని సాల్లెకు పంపితే పసులెవ్వరు గాయాలె? మనోని సంగతి అట్లుండని గొల్ల కొమురయ్య చిన్న పోరి మారెమ్మ కథ జెప్త సూడు.

కొమురయ్యకు నల్గురు ఆడిగడ్డలేనైరి. పెద్దోళ్ళి ద్దరి పెండ్లిళ్ళ జేసి మూడో దాన్ని ఎవడో పెండ్లాం జచ్చినోనికి శీరెరైక కిచ్చిండు. ఇగ వుంది అఖిరి పోరి మారెమ్మ. తల్లి లేని దీనికి ఎట్ల లెక్కవెట్నా తొమ్మిదేండ్లు నిండలే. మూడో పోరి మొగనింటికి పోయినంక మూడేండ్ల సంది ఇంటి పనంత దీని మీదనే పడ్డది. బువ్వకూ కూరొండాలె, అలకాలె పుయ్యాలె, బట్టబాతలుతకాలె. అయ్యెంబడి జీవాలెంట పోవాలె. గొర్లు మేకలు కలిపి జీవాలు ఇరువైదోకున్నయి. గొమురయ్య ముసలోడు గావొచ్చిండు. పొద్దూకితే ఇంత సుక్కేసుకొని, "పరం జీరి నడుముకు జుట్టి, పడారుగురు పట్టంగ, ఇద్దరు గొట్టె"నంక పాటలు పాడుకుంట పండుకుంటడు. శాస్త్రం తెల్వాలేదనుకుంట సుట్ట దాగి, పాటలు పాడుకుంట పండుకుంటడు. మారెమ్మ అన్ని లేపీ, లేపీ బువ్వదినపెట్టాలె. అనికె సొంటి కోపమొచ్చినా దానియీపు మెదిగేస్తడు. అమ్మ కోపం జూసి అది ఒండినవన్ని ఆడనూకి బైటికి ఉర్కుతది. అదు పండినంక మెల్లగొచ్చి బొంతేసుకుని ఓ మూలకు పంటది. మల్ల తెల్లారి మామూలే. 'అదు' మారీ, మారీ! మారెమ్మ దా బిడ్డా" అని దెగ్గరికి దీస్తడు. రాత్రికన్ని మర్చి పోతడు. కూరమంచిగ లేదని, బువ్వ మెత్తగైందని, కొట్టినట్టు అనికి యాదికేవుండదు.

మారెమ్మ జీవాలెంబడుంటే అదు ఆ బాయి గాడ, ఈ బాయికాడ ముచ్చటపెడ్తదు. ఆ పోరి తాను పామోలె, దేసుకుక్కోలె ఉరికురికి గొర్ల మల్లెస్తది. కాళ్ళకు టైరు సెప్పలు, ఒక చెప్ప ఉంగటం తెగితె బట్ట పెట్టి కుట్టుకుంది. చినిగిన లంగ, పక్క టెంక బొక్కల మీదికి జాకీటు అదీ భుజమ్మీద చినిగుంటది. ఎర్రగ పీసు వారి నెత్తి అది పీకేసిన తాటి పండులెక్కుంటది. ముక్కు కుట్టిచ్చుకుందేమొ రాగితీగె పోగు, రెండు చెవులకు ఏం లేక యాపపుల్లలు పెట్టింది. మెడల నల్ల దారం తోటి వెంకటేశ్వర్ల బిల్ల, భుజంమ్మీద చినిగి పోయిన కీస గొంగడి, చేతిల దుడ్డు కట్టెనో గొడ్డలి శిప్పో వుంటది ఇది మారెమ్మ వేషం.

నా నాల్గు రోజుల కింద జెరాతి నానుకొని వున్న నల్లగంచెల కెల్లి గొర్లను గొట్కొస్తుందట. జెర శీకటి శీకటైతుందట. అందు కొండ పక్క నుండి మెల్లగా సాటుంగ మాటుంగ ఒచ్చిన తోడేలు ఒక గొర్రెను అందుకొని ఉర్కు వుచ్చుకుంది. మారెమ్మ అదిజూసి లబ్బలబ్బ మొత్కొని దానెంబడి పడ్డది. మారిపోరి, కుక్కా ఇద్దరు తోడేలును తరిమి తరిమి నెమలిగుట్ట కాడ ఇగ సాయిద లేదని తోడేలు ఇడిసి పెట్టిన గొర్రెను ఎత్కొని మందకాడి కొచ్చింది. అప్పటికే చెట్ల చెంచారమైన జీవాలన్నిట్కి ఒక తానికి గొట్టెటాళ్ళకు దాని సానమంత వుల్లశిల్లింది.

తెల్లారేటాల్లకు గొర్రె నిర దొక్కుకుంట కింద మీద జేస్తుంటే ఇక చెయ్యి దాటిందని దాన్ని గోసి కుప్పలేసిండు కొమురయ్య. మారెమ్మ కుప్పలన్నీ ఇంటింటికి ఇచ్చి ఒచ్చేదాయె అట్ల పొద్దే పోయింది. సన్న పంబటాలప్పుడు మందను గొట్కొని మశీదు బాయి ఒంపుల తుమ్మ కింద కూసుండి నిన్నటి గొర్రె యాది కొచ్చి పల్లి పల్లి ఏడిసిందట. కుక్క చెవులు నిక్క పొడుసుకొని మారెమ్మ మొకం జూసుకుంట దెగ్గరికి రాంగానే దానికి నవ్వొచ్చింది. నవ్వి కండ్లనీళ్ళు దూడ్చుకొని కుతికె మీద చెయ్యి పెట్టుకుంటె కాలి పోతుందట. కండ్లు మండపడుతున్నయట. అప్పుడు తెలిసింది తనకు జెరమొచ్చిందని. ఐనా జీవాల ఎడమ డొక్కలు దిక్కు చూస్తే అవి లోపలికి పొయ్యి వున్నయి. గోసనిపిచ్చింది. మెల్లగ లేసి లంగ గోశి లెక్క గట్టి గొడ్డలి చేత పట్టుకుని చెట్టెక్కింది. రెండు మండలు నరికేసి ఇంకో మండ నరుకుతుంటే పట్టుదప్పి గొడ్డలి జారి కాలు మీద పడ్డది. పాదం కస్సున సగం తెగింది. చెట్టు మీది కెల్లి అట్లనే జారి దొప్పన కింద పడ్డదట. ఒకటే ఏడుపు సుట్టు పట్లున్న బావులకాడి జీతగాళ్ళు ఉరికొచ్చి సూసి 'అయ్యో పోరి ఎంత పని జేసుకుంటివే" అన్నరు

అప్పటికే కుక్క గొముర‌య్య దగ్గరికి పొయ్యి మొరుగుతుంటే ఏందా అని ఉరికొచ్చిండు.

మారమ్మ కాటుకు నల్లెంగ ఆకు దంచి కట్టుకట్టిండు. మూడు రోజుల నంది అది జెరంతోని గుడిసెల్నే వండి వుంది. కాస్తే ఆడింత గంజి కాసి పోస్తడు. లేకుంటే నుట్టు పట్ల వున్నోల్లు తెచ్చి పోస్తరు. అది మంచిగై లేచి తిరిగేటాల్లకు దాని కాలుంటదా తెగిన తానికి నరికేస్తరా తెల్వదు నాకు.

ఇదీ మనకు రాజ్యమొచ్చినంక ఇన్నెండ్లకు మన పల్లెల గొప్పతనం. డాక్టరు లేని ఊరని మల్ల నీకు చెప్పాలని గాదు కాని మన మోటు నాటు వైద్యం పానాలు దియ్యదా? వడి దెబ్బ దాకితే మన్ను జల్లు కుంట లేకపోతే మొండికేసి కారం జల్లుకుంటం, గడ్డిగోస్కుంట చెయ్యి దెగితే తమలపాకు నమిలి తెగిన తాన ఊమూంచి అది గడ్డం, చెవుపోటు లేస్తే మూనె గాసి పల్లారి నంక చెవుల పోస్తం. నెత్తినొస్తే నెత్తికి బిగ్గర బట్ట గట్టుకుంటం, కాళ్ళు గుంజితే కాళ్ళకు బట్టలు గట్టుకుంటది ఏనెకింది రాములమ్మ. కావలి బుచ్చయ్య జెరమొస్తే రొండు చెప్పేల సార దాగి పండుకుంటే తక్కువైతదంటడు. ఇదీ మన ఊరి వైద్యం. ఇవ్వన్నీ జేస్తే బాధలన్నీ పెరుగుతాయి గాని తక్కువైతాయా? ఎన్కిశీరీ డాక్టర్ల తానికి నాలుగైదు మైళ్ళ నడిసి పోతె" థూ మీరంత తెలివిలేని దద్దమ్మలు మీకు తెలివెప్పుడొస్తదో అర్థం గాదు. అందుకే దేశం నాశనమైతుంది. మీ అసొంటోళ్ళు వుండవట్టే. దెబ్బ తాకితే కూరబుప్పేసి ఇంక పట్టి గట్టక పోయినవ్?" అని తిడ్తడు డాక్టరు. మాకు తెలివెట్లొస్తదో? తెలివి జెప్తందుకు మా ఊరి కొచ్చినోడెవ్వడో? ఆ డాక్టరయ్యకు తెలువదు. ఆయన తిడుతుంటే ఒకరికి భయపడుడే గాని ఈ జనం ఏం మాట్లాడరు. "మావోడు దెబ్బలకోరుస్తడంటే ఇడిపించే దిక్కు లేక" అన్నట్టు.

చంద్రం! ఎందుకో ఈడ వుండాలని అనిపిస్తలేదు. మల్లజూస్తే ఈ మన జనాలనంత ఇడిసి, ఊరిడిసి రావాలనీ లేదు. ఈ దసర, దీపాళి ఎల్లినంక మనం అటో ఇటో దేల్చుకుందాం. నేనన్న నీ దగ్గరికొస్త లేకుంటే నువ్వు ఈడికన్న రావాలె. ఎవ్వరో ఏమో అంటరని మనం చెట్లు వట్టుడు గాదు. పోయిన తాన్నే దేవులాడుకోవాలె. మంచి అనేది మన దిక్కుంటే మనం ఈడినే వుందాం. కాదనేటోళ్లనే ఎలగొడదామనిపిస్తది గాని ఆ యాల్ల నేనే నిన్ను ఎంత బలవంతంగ వంపిన్నో, పోనంటే ఎంత బతిమిలాడి ఏడిపిన్నో యాదొస్తే సిగ్గైతది. ఇన్ని ఆలోచన్లు ఎందుకంటే మనం కలిసుండాలెననే...

—నీ

వసంత.
15.10.'80.


# వాస్తుజ్యోతి

## వాస్తువిద్వాన్ దంతూరిపండరీనాధ్

ఆర్.వీరేశలింగం, రామచంద్రాపురం(మెదక్)

నేను ప్రస్తుతం అద్దెకుంటున్న ఇల్లు అమ్మకానికి రాగా, దానిని కొనడం జరిగింది. దానికి స్వల్పమార్పులు చేసి వ్యాపారానికి అనుకూలంగా తయారుచేసి నేను వుంటున్నాను. కానీ ఇలా జరిగాక రానురాను సమస్యలు పెరుగుతున్నాయి. ఇది ఎటువంటి పరిస్థితికి దారి తీసిందంటే నాకున్న ఒక ఫ్లాటును అమ్మితే గానీ ఋణ బాధ తీరని పరిస్థితికి వచ్చింది. అమ్మకం ప్రయత్నాలు కూడా కొనసాగడం లేదు. వాస్తు రీత్యా దీనికి నివారణ ఉండవచ్చని అనిపించి మీకీ ఉత్తరం రాస్తున్నాను. నా సమస్యకు వాస్తురీత్యా పరిష్కారం సూచించగలరు.

మీ ఇంటికి వివిధ వ్యాపారాల కనుగుణంగా మలచుకోవటం బాగానే ఉంది. కానీ సత్ఫలితాలు కలగకపోవడానికి, ఆస్తి అమ్మితే గాని అప్పులు తీరని పరిస్థితి ఏర్పడడానికి అందులోని వాస్తు దోషాలే కారణమయ్యాయి. బెడ్‌రూం కంటే హాలుని తగ్గించి కట్టడం ద్వారా పూర్తి ఇంటికి ఈశాన్యం లోపించింది. దక్షిణ వీథివున్న ఈ యింటికి తూర్పున కాంపౌండ్ గోడలోపల ఖాళీస్థలం ఉన్నప్పటికీ తూర్పుద్వారం ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. బెడ్‌రూం యొక్క ఉత్తరపు గోడకు పారుగా, హాలుని పెంచి, ఈశాన్య లోపాన్ని సవరించుకోండి. బెడ్‌రూంలో ఈశాన్యమూలను గుండ్రంగా కాక ఈశాన్య మూల ఏర్పడేలాగా సరిచేయండి. హాలులో ప్రస్తుతం తూర్పున ఉన్న కిటికీ బదులుగా తలుపు తెరవండి. వాయవ్యంలో యింటికి ఆనుకొని ఉన్న బాత్రూమ్‌ని ఇంటికి తగలకుండా కొంచెం ఎడం చేయండి. వీథిలో నుండి ఇంట్లోకి వెళ్లడానికి దక్షిణ ఆగ్నేయ గేటుని మాత్రమే ఉపయోగించండి. బావికి ఎదురుగా హాలుకి ఉత్తరంలో ప్రస్తుతం ఉన్న తలుపుని గోడతో గానీ, కిటికీతో గానీ సరిచేయండి. మీకు తప్పకుండా మంచి ఫలితాలు కనిపిస్తాయి.






వాస్తువిద్వాన్ దంతూరి పండరినాథ్
గౌరవ వాస్తుసలహాదారులు: ISKCON
(International society for krishna consciousness:sec bad)

ఫ్యాక్టరీల, ఇండ్ల వాస్తు సవరించుకుని ఆర్థిక, ఆరోగ్య, ఐశ్వర్యాభివృద్ధి పొందడానికి రోజూ వస్తున్న అనేక ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు యివ్వటం అసాధ్యం. ప్రతి నెలా మీ ప్రాంతానికి దగ్గరగా సంప్రదించే సదవకాశం...

1,2,3 తేదీలు: బెంగుళూరు: హోటల్ కనిష్క, ఫోన్: 2265544, 2266843,
4,5,6 తేదీలు: ముంబాయి: హోటల్ అన్నపూర్ణ, ఫోన్: 5280124, 5286187,
20,21,22 తేదీలు: విశాఖపట్నం: హోటల్ అనంత్, ఫోన్: 550112, 550113
15,16,17 తేదీలు: విజయవాడ: హోటల్ మనోరమ, ఫోన్: 571621
18,19 తేదీలు: రాజమండ్రి: హోటల్ మహాలక్ష్మి, ఫోన్: 65231

Head Office: Sai Sree Vaasthu.
secunderabad.
Tel: Off: 844677, 817446, Fax: 040 844677.
Pager: 9612-2527, Cell: 98490-33369